



RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 8

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 4 జూన్ 2026

# హెల్తీ సిటిజన్స్‌తోనే వెల్తీ నేషన్ నిర్మాణం

- హెల్తీ సిటిజన్స్‌తోనే వెల్తీ నేషన్ నిర్మాణం
- ఇంటి దగ్గరకే అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా 'సంజీవని'
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణకు ప్రత్యేక సెల్
- యూరియా వాడకం తగ్గితే మెరుగ్గా ప్రజారోగ్యం
- లలితా పీవీఎస్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**గుంటూరు, కలంకౌంటర్ :** హెల్తీ సిటిజన్స్.. వెల్తీ నేషన్ నిర్మించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అందుకే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని సీఎం తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లాలో పర్యటించారు. లలితా పీవీఎస్ హాస్పటల్‌ను ప్రారంభించి, పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలిత ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'ఆరోగ్యానికి మించిన ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులు. వేల కోట్ల రూపాయలున్నా, భవంతులు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. ప్రభుత్వం త్వరలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టును చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. ప్రతీ ఒక్కరికి డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. అత్యుత్తమ వైద్య విధానాలను ప్రజల ఇళ్ల దగ్గరకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలనే అంశాలను కూడా సంజీవని ద్వారా ప్రజలకు గైడ్ చేస్తాం. త్వరలో యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నాం. ఒకొక్కరికి రూ.2.50 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం.' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి రాకూడదు..** 'తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు అందించినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు సరైన ఆహార నియమాలు పాటించాలి. అప్పుడే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. ఫుడ్ మెడిసిన్... కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలను ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం

- 2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్



**బెంగళూర్,కలంకౌంటర్ :** డి.కె.శివ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సతీషన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది... కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది: పవన్

- తెలంగాణ ప్రజలను చూస్తే ముచ్చటగా ఉంటుందన్న పవన్ కళ్యాణ్
- తెలంగాణ అనే బలమైన భావన వారిలో ఉందని ప్రశంస
- ఆంధ్రాలో మాత్రం ఐక్యత లేదని, ఉప ప్రాంతీయతలే ఉన్నాయని ఆవేదన
- ఆంధ్రా ప్రజల్లో కనీసం 'ఆంధ్ర' అనే ఉమ్మడి గుర్తింపు ఉండాలన్న పవన్




**తెలంగాణ,కలంకౌంటర్ :** తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే బలమైన ఐక్యతా భావన ఉందని, దాన్ని చూస్తే తనకు ముచ్చట వేస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఉమ్మడి భావన కొరవడిందని, ఇక్కడ ఐక్యతకు బదులుగా ఉప ప్రాంతీయతలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన పవన్, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న ప్రాంతీయ అస్తిత్వంపై ఆసక్తికర విశ్లేషణ చేశారు. "తెలంగాణ ప్రజలను చూస్తే ఎందుకు ముచ్చటేస్తుందంటే, వారిలో తెలంగాణ అనే భావన ఉంటుంది. తమిళులకు వారి భాషా, ప్రాంతంపై అభిమానం ఉంటుంది. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో 'ఆంధ్రా' అనే ఉమ్మడి భావన కొరవడింది. ఇక్కడ సబ్-రీజనలిజం, కులతత్వమే ఎక్కువ" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను 'జై ఆంధ్ర' అని

- 2లో

## వై ఎస్ జగన్ తో డిఎస్సీ అభ్యర్థులు భేటీ





**తాడేపల్లి,కలంకౌంటర్ :** వై ఎస్ జగన్ తో డిఎస్సీ 2025 అభ్యర్థులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు తమ అభిప్రాయాలు వివరించారు.

## డిఎస్సీ 2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం

- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు పబ్లిక్ డోమైన్ లో ఉంచాము
- అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు-రాష్ట్ర హోం మంత్రి అనిత



**అమరావతి,కలంకౌంటర్ :** డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత అన్నారు. ఏపీ సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారిగా పని చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీ ని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60 రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100 పోస్ట్ లతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. కాని మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించారని తెలిపారు. 8 సంవత్సరాల నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9 నెలల తరువాత రాద్ధాంతం చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని, ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటి వరకు దాదాపు 2 లక్షల మంది ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారని మంత్రి అనిత గుర్తుచేశారు. వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందని తెలిపారు. అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపా తంగా, పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ జరుగుతుందన్నారు. డిఎస్సీ 2025 నిర్వహణకు ప్రభుత్వం 240కి పైగా కోర్టు కేసులు దాటుకుని సుమారు 148 రోజుల్లోనే రికార్డు స్థాయిలో 16,347 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని చెప్పారు. అంతేకాకుండా 15వేలకు పైగా టీచర్ పోస్ట్ లు అతి గౌరవంగా వారికి అందించడం జరిగిందన్నారు. ఒకసారి అలోచిస్తే డిఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుండి అభ్యర్థులు తమ కుటుంబాలకు దూరంగా ఎక్కడో సూదూర ప్రాంతాల్లో కోచింగ్ తీసుకుని మరీ సిద్ధం అవుతారన్నది వాస్తవమని అన్నారు. నెలలు సంవత్సరాల తరబడి శిక్షణ పొంది పరీక్ష వ్రాసి ఎంపికై సగౌవరంగా ఉద్యోగంలో చేరతారన్నది నిజమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా డిఎస్సీ అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్ లు అందించి దిశానిర్దేశం చేశారని గుర్తు చేశారు. ఒక ఎమోషనల్ బాండింగ్ ఉన్న డిఎస్సీ పై అవాకులు చవాకులు పేలడం దారుణమన్నారు. నిబంధనల మేరకు డిఎస్సీ నిర్వహించి మూడు స్థాయిల్లో గ్రీవెన్స్ నిర్వహించి, గ్రీవెన్స్ లో 34 వేలకు పైగా గ్రీవెన్స్ వస్తే వాటి అన్నింటిని పరిష్కరించి ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా డిఎస్సీ నిర్వహించామన్నారు. అత్యంత పకడ్బందీగా

- 2లో



## జిల్లాలో నంబర్ 1 స్థానంలో సి హెచ్ సి



**పర్చూరు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ప్రజల సానుకూల అభిప్రాయం ఆధారంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన 20 ప్రభుత్వ ఆసుపత్రుల జాబితాలో పర్చూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) చోటు దక్కించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మూల్యాంకనంలో పర్చూరు సీహెచ్‌సీ 6వ స్థానాన్ని సాధించగా, బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సమిష్టి కృషి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ విజయానికి కారణమని ఆమె పేర్కొన్నారు. ఈ ఘనత సాధించినందుకు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ మామిడిపాక హరి ప్రసాదరావు సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్యతో పాటు వైద్యులు, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసి శ్రీనివాసరావు ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ





**విజయవాడ, కలంకౌంటర్ :** వాసవి జాగృతి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ విజయవాడ గ్రేటర్ అజిత్ సింగ్ నగర్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడం కోసం తలపెట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ రోజున 42 వ రోజు సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మల్లికార్జున కుమార్, స్మైల్ ప్రకాష్, మదన సీతారత్నకుమారి, చోడవరపు లక్ష్మి మరియు సభ్యులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే ఇంటూరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై ప్రేమ్ కుమార్



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును బుధవారం ఒలేటివారిపాలెం ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రేమ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## పొగాకు రైతులను ఆదుకోండి

- గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి
- మంత్రి అచ్చెంనాయుడు ని కోరిన ఎమ్మెల్యేలు ఇంటూరి,



**విజయవాడ, కలంకౌంటర్ :** ఈ ఏడాది పొగాకుకు గిట్టుబాటు ధరలేదు. కనీసం పెట్టుబడులు కూడా రావేమోనన్న ఆందోళన రైతుల్లో ఉంది. కందుకూరు ప్రాంత రైతుల ఆవేదనను మీ దృష్టికి తీసుకు వస్తున్నాం. వారికి న్యాయం జరిగేలా వెంటనే చర్యలు తీసుకోండి... అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు కె.అచ్చెంనాయుడు కి కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం విజయ-వాడలో మంత్రిని ఎమ్మెల్యేలు కలిసి... పొగాకు రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ఏడాది మార్కెట్ ధరలు, వ్యాపారుల మందకొడి కొనుగోళ్లు, రైతుల పెట్టుబడి, దిగుబడి... ఇంకా పలు అంశాలను మంత్రిగారికి వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.మంత్రి స్పందిస్తూ... ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పొగాకు రైతుల సమస్యలపై అధికారులతో భేటీ జరగబోతోందని వెల్లడించారు. రైతులను తప్పక ఆదుకునేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

# హెల్తీ సిటిజన్స్‌తోనే వెల్తీ నేషన్ నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలా మందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారు.' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**రాష్ట్రంలో అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందిస్తాం..**

'హైదరాబాద్‌లో ఒకప్పుడు నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు ఇతర చిన్న ఆసుపత్రులు మాత్రమే ఉండేవి. హైదరాబాద్‌లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు... నాడు హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకునే పరిస్థితి నెలకొంది. ఏపీని అదే స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. బెస్ట్ హాస్పటళ్లను రాష్ట్రానికి రప్పిస్తున్నాం. టెక్నాలజీతో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ తరహాలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు... మెరుగైన వైద్య చికిత్సల కోసం అమరావతికి వచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు వైద్యారోగ్య సేవలు అందించే విషయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చక్కగా పని చేస్తున్నారు. టెక్నాలజీని వైద్యారోగ్య రంగానికి అనుసంధానం చేసేలా సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారు. ఇక లలితా హాస్పటల్స్ ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా... అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన యజమాన్యాన్ని అభినందిస్తున్నాను. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్ ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరం. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి... అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుంది.' అని ముఖ్యమంత్రి అన్నారు.



# ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం రెపరెపలు

- ప్రపంచాన్ని ఆకట్టుకున్న ఏపీ ప్రకృతి వ్యవసాయం
- ప్రకృతి వ్యవసాయంలో ఏపీకి విశిష్ట స్థానం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు






**అమరావతి,కలంకౌంటర్ :** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పర్యావరణ పురస్కారంగా గుర్తింపు పొందిన 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్--2026' ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం కు లభించడం రాష్ట్రానికే కాక దేశానికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అరుదైన అంతర్జాతీయ గుర్తింపుతో ప్రకృతి వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, రాష్ట్ర ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి, రైతులు, గ్రామీణ మహిళల అంకితభావంతో కూడిన కృషికి ప్రపంచ వేదికపై లభించిన గౌరవమే ఈ పురస్కారమని మంత్రి వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, గ్రామీణ మహిళలు, ప్రకృతి వ్యవసాయ ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిరూపించిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సేవలు అభినందనీయమని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయ శాస్త్రాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న 1,000 మందికిపైగా రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లు, 700 మందికిపైగా రైతు పరిశోధకుల సేవలను ప్రత్యేకంగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయ ప్రయాణంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది అందించిన సహకారం అమూల్యమని మంత్రి అన్నారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, కేఎఫ్‌డబ్ల్యూ జర్మన్ బ్యాంక్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, కో-ఇంపాక్ట్ సంస్థలతో పాటు ఈ కార్యక్రమానికి తోడ్పడిన జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కొత్త అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో జ్ఞాన మార్పిడి, పరిశోధన భాగస్వామ్యాల విస్తరణ, రైతు శాస్త్రవేత్తలకు మరింత ప్రోత్సాహం, ప్రదర్శన క్షేత్రాల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఈ అవార్డు బలమైన వేదికగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఒక పురస్కారం మాత్రమే కాదని, సుస్థిర వ్యవసాయం, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధించిన పురోగతికి ప్రపంచం అందించిన గౌరవమని పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని విశ్వసించి అభివృద్ధికి తోడ్పడిన ప్రతి రైతు, ప్రతి మహిళ, ప్రతి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత..







**మంగళగిరి/అమరావతి,కలంకౌంటర్ :** కార్పొరేషన్ చైర్మన్లు సీఆర్ రాజన్, సత్తిబాబుతో కలిసి వినతులు స్వీకరించిన మంత్రి సవిత. పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్ సహాయం కోసం పలువురు వినతులు సమర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ముస్లిం విద్యార్థులకు మాతృభాషలో బోధన అందించేందుకు ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని విజ్ఞప్తి. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పలువురు మంత్రి సవితను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికే టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. గ్రీవెన్స్ కార్యక్రమాల ద్వారా పాలనను పేదల చెంతకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. త్వరలో అన్ని రకాల కొత్త పెన్షన్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత తెలిపారు.

## తెలంగాణ ప్రజల్లో 'తెలంగాణ' అనే భావన ఉంటుంది... కానీ ఆంధ్రా ప్రజల్లో 'ఆంధ్రా' అనే భావన లోపించింది: పవన్

(మొదటిపేజీ తరువాయి)

నినాదం ఇచ్చింది కూడా అందుకేనని పవన్ స్పష్టం చేశారు. కనీసం 'మేమంతా ఆంధ్ర' అనే ఒక ఉమ్మడి గుర్తింపు రాష్ట్ర శ్రేయస్సు కోసం అవసరమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తన సూచనను ఉన్మాద స్థాయికి తీసుకెళ్లమని కాకుండా, రాష్ట్రం కోసం కనీస ఐక్యతను పెంపొందించుకోవాలనే ఉద్దేశంతోనే ఆ మాట చెప్పానని వివరించారు. ఈ రకమైన ఉప ప్రాంతీయతలతో రాష్ట్రం ఇప్పటికే అన్ని రకాలుగా విడిపోయిందని, ఇకనైనా కలపడానికే ప్రయత్నించాలని ఆయన అన్నారు.

## తెలంగాణ రాజకీయాలపై ఏపీలో పవన్ కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ,కలంకౌంటర్ :** తెలంగాణ ఎవరి జాగీరు కాదని, అక్కడి రాజకీయాల్లో జనసేన భాగస్వామ్యంపై వస్తున్న విమర్శలకు అర్థం లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. బుధవారం అమరావతి పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పోటీ చేసే హక్కు అక్కడి భూమిపుత్రులకే ఉంటుందని అనడం సరికాదని, ఇతరులు పోటీ చేయకూడదని అభ్యంతరాలు చెప్పడం తగదని అన్నారు. అంతకుముందు, అమరావతిలోని 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి పవన్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయులను కులాలకు పరిమితం చేసే ధోరణిని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు విపరీతంగా పెరిగాయని, వాటిని ఎదుర్కొనేందుకే "సేనా గళం" కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ తరఫున అక్కడి స్థానికులే పోటీ చేస్తారని, ఆంధ్రప్రదేశ్ నేతలు ఎవరూ అక్కడికి వెళ్లి పోటీ చేయబోరని స్పష్టత ఇచ్చారు. "తెలంగాణ బిడ్డలు పోటీ చేస్తే అభ్యంతరం ఎందుకు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. గద్దర్ కుటుంబం పట్ల, కేటీఆర్ పట్ల తనకు గౌరవం ఉందని, అయితే దేశ సమగ్రతకు భంగం కలిగించే చర్యలను వ్యతిరేకిస్తానని అన్నారు. కేటీఆర్ తనకు సోదరుడితో సమానమని అన్నారు.

## డీఎస్సీ 2025ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాం

- స్పోర్ట్స్ కోటా సర్టిఫికెట్లు పబ్లిక్ డొమైన్ లో ఉంచాము
- అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చు-రాష్ట్ర హోం మంత్రి అనిత

(మొదటిపేజీ తరువాయి)

టీసీఎస్ ద్వారా దాదాపు 43వేల ప్రశ్నలను సిద్ధం చేసి మరీ డిఎస్సి నిర్వహించామన్నారు. స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని మంత్రి అనిత తెలిపారు. 3 శాతం రిజర్వేషన్ అంటే 421 పోస్టుల భర్తీ ప్రక్రియను ప్రారంభించారని అయితే కేవలం అర్హులు 382 మందిని మాత్రమే భర్తీ చేయడం జరిగిందన్నారు.ఎంపికైన వారి సర్టిఫికెట్లను పబ్లిక్ డోమైన్ లో కూడా పెట్టడం జరిగిందని అవసరమైన వారు వాటిని పరిశీలించుకోవచ్చని అన్నారు.స్పోర్ట్స్ కోటా అయినా విద్యార్హతలు మాత్రం తప్పని సరి అని అవి కూడా 15 మంది సభ్యుల బృందం పరిశీలించి మరీ ఎంపిక చేయడం జరిగిందన్నారు.స్పోర్ట్స్ కోటాకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల క్రీడా సర్టిఫికెట్లను ఫెడరేషన్ లు,అసోసియేషన్ లకు పంపించి వెరిఫై చేసి ఆ తర్వాత హారిజంటల్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. బ్రిడ్జి స్పోర్ట్స్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు లోబడే ఆథరైజ్డ్ గా తీసుకోవడం జరిగిందన్నారు.బ్రిడ్జి స్పోర్ట్స్ ను ఏషియన్ గేమ్స్ 2018, 2022లో కూడా నిర్వహించారన్నారు. ఇందులో ఇండియాకు కాంస్య పతకం సైతం వచ్చిందన్నారు.గత ప్రభుత్వం గ్రూప్-1 ను అనేక అవకతవకలతో నిర్వహించి అభాసు-పాలయిందని అటువంటి సంఘటనలు చంద్రబాబు పాలనలో ఒక్క సంఘటనైనా చూపాలని మంత్రి అనిత డిమాండు చేశారు.

## స్వామి వారి దర్శనానికి వచ్చి భక్తురాలు మృతి

**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చి ఆకస్మాత్తుగా భక్తురాలు మృతి చెందిన సంఘటన బుధవారం, స్వామివారి ఆలయం వద్దచోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. కైకలూరు మండలం కైకలూరు గ్రామానికి చెందిన మానుపాటి శ్రీదేవి (50) స్వామివారి దర్శనం చేసేందుకు, మంగళవారం రాత్రి దేవాలయంలో నిద్ర చేసింది. తెల్లవారుజాము చూడగానే మృతి చెందినట్లు తోటి భక్తులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మోపిదేవి ఎస్ఐ గౌతమ్ కుమార్ తెలిపారు.

# శ్రీ బగళాముఖి అమ్మవారి సన్నిధిలో ప్రముఖులు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన నూతన ఎస్సై కె. మాధవరావు
- అమ్మవారి సుప్రభాతాన్ని తన గళంతో రికార్డ్ చేయనున్న సినీ సింగర్ మనో.
- దర్శించుకున్న మడకశిర మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి





**(బాపట్ల జిల్లా) చందోలు,కలంకౌంటర్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చందోలు శ్రీ బగళాముఖి అమ్మవారి ఆలయం బుధవారం భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. చందోలు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్న కె. మాధవరావు తన పదవీ బాధ్యతలకు ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్సై కె. మాధవరావు మాట్లాడుతూ, "అమ్మవారి ఆశీస్సులతో నూతన బాధ్యతలను స్వీకరిస్తున్నాను. చందోలు పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉంటూ, రక్షణ కవచంగా నిలవడం నా బాధ్యత" అని పేర్కొన్నారు. ప్రముఖ సినీ గాయకుడు, గానగంధర్వుడు మనో తన సతీమణితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని దైవిక వాతావరణానికి ఆయన ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా మనో మాట్లాడుతూ, "అమ్మవారి మహిమను మాటల్లో చెప్పలేం. భక్తితో ఆమె సుప్రభాతాన్ని నా గళంతో రికార్డ్ చేయాలని నిశ్చయించుకున్నాను. త్వరలోనే ఈ సుప్రభాత గీతాన్ని అమ్మవారి పాదాల చెంత సమర్పిస్తాను" అని వెల్లడించారు. మడకశిర పూర్వ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ, "అనేకమంది స్నేహితుల సూచన మేరకు ఈ ఆలయానికి వచ్చాను. ఇక్కడ అడుగుపెట్టగానే ఎంతో ప్రశాంతత లభించింది. ఇటువంటి మహిమాన్వితమైన క్షేత్రాన్ని దర్శించుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను" అని తెలిపారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కలకోట చక్రధర రెడ్డి, ఈవో జి. నరసింహమూర్తి అతిథులకు ఘనస్వాగతం పలికి, అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, "శ్రీ బగళాముఖి అమ్మవారి ఖ్యాతి రాష్ట్ర సరిహద్దులు దాటింది. ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు నిత్యం తరలివస్తున్నారు. ప్రతి అమావాస్యకు నిర్వహించే విశేష హోమ, అభిషేక కార్యక్రమాలకు వేల సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి, సౌకర్యాల మెరుగుదలకు పాలకమండలి నిరంతరం కృషి చేస్తోంది" అని వివరించారు.

# పోలీసు సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమమే ప్రాధాన్యత

## -ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు





**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రకాశం, మార్కాపురం పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, క్యాన్సర్ పరీక్షలతో పాటు ఇతర వ్యాధుల పట్ల అవగాహన పెంపొందించి, తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఒంగోలు పట్టణంలోని ఉపవాస హాస్పిటల్ , క్యాన్సర్ రహిత భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది , వారి కుటుంబ సభ్యులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం అత్యంత ముఖ్యమన్నారు. క్యాన్సర్ అనేది ప్రమాదకరమైనదని, ఇటీవలి కాలంలో క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో దానిని తగ్గించేందుకు అనేకచోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారని, ఇందులో భాగంగా సాధారణంగా అధిక వ్యయంతో నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఇక్కడ ఉచితంగా అందిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరంతర విధులు, మానసిక ఒత్తిడి, అసమయ భోజనం, నిద్రలేమి వంటి కారణాల వల్ల సిబ్బంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది దేహదారుఢ్యంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, పోలీసులు ఆరోగ్యంగా, ఫిట్ నెస్ తో ఉంటనే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. ఈ మెడికల్ క్యాంపులో మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్, ప్రోస్టేట్ క్యాన్సర్ స్క్రీనింగ్, పాట్ స్మియర్,బీపీ, షుగర్ ఉ థైరాయిడ్, జనరల్ సర్జరీ, ఈసీజీ, జనరల్ మెడిసిన్, మొదలైన విభాగాలకు చెందిన నిపుణులైన డాక్టర్లు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్స చేసి మెడిసిన్ అందించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ హాజరత్తయ్య,ఒంగోలు వన్ టౌన్ వెంకటేశ్వరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరి, సింగరాయకొండ సీఐ శ్రీహరి, ఉపవాస హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లు ఉమాపతి చౌదరి, ప్రకాష్ చవల, అనీల్ కుమార్, పోకూరు శ్రీనివాసులు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు.. పోస్టర్ ఆవిష్కరణ




**విశాఖపట్నం,కలంకౌంటర్ :** రెండేళ్లుగా చంద్రబాబు దుర్మార్గ, రాక్షస, అరాచక పాలనను ప్రజలకు తెలియజేసే "వెన్నుపోటుకు రెండేళ్ళు" పోస్టర్ ఆవిష్కరణ విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించిన కార్యక్రమం విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షుడు,విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త లికె.కె రాజు లి ఆధ్వర్యంలో జరిగింది. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాధం, పేడాడ రమణికుమారి,ఉత్తరాంధ్ర ప్రచార విభాగం అధ్యక్షలు రవిరాజు,మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,మాజీ కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు,అల్లు శంకరరావు, రెయ్యి వెంకటరమణ,బర్కత్ అలీ,జి.వి రమణి,దల్లి రామకృష్ణ,వార్డు అధ్యక్షులు పైడి రమణ,గుడ్ల అశోక్ రెడ్డి,బొడ్డేటి కిరణ్,బీశెట్టి ప్రసాద్, బలిరెడ్డి గోవింద్,దోప్ప శ్రీను,వేణు,ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర, జోనల్,జిల్లా,నియోజకవర్గ నాయకులు కిరణ్ రాజు,తాడి జగన్నాధరెడ్డి, తుళ్ళి చంద్రశేఖర్,అంబటి శైలేష్,యం. సునీల్,బాణాల తరుణ్,బోగవల్లి గోవింద్,ఆడారి దివ్యకల,పి. ఈశ్వరి,రాధ,రేవతిరావు,కర్రి రామారెడ్డి,నీలి రవి,కోడూరి సత్యనారాయణ,సాయి,కోడూరి సుశీల,శ్యామల,బొడ్డేటి గంగామహేష్,సబ్బవరపు శ్రీను, వార్డు పరిశీలకులు షేఖ్ బాబ్జి, రాఘవులు,బద్రి,బోణి అప్పారావు,నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు ముచ్చల సంతోష్,హరికృష్ణ,తాటిపూడి రత్నం,కోట్యాడ సూర్య,సీనియర్ నాయకులు మునిర్ ఖాన్,సుజాత,శ్రావణ్, శివప్రసాద్, బొట్ట రాజు,సురేష్,రాము, ఆదిలక్ష్మీ, సీతాకుమారి, గణేష్,కృపా, మోహన్,వినీల్, జామిదాసు,ప్రసాద్ రాజు,మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ తో నగరాన్ని పరిశుభ్రం చేద్దాం..

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.




**తిరుపతి,కలంకౌంటర్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా బుధవారం ఉదయం నగరంలోని సుబ్బారెడ్డి నగర్, కొర్లగుంట, భవానీ నగర్, టిటిడి పరిపాలన భవన్ పక్క సందులో పెద్ద మురుగునీటి కాలువలను శుభ్రం చేసే ప్రక్రియను మాజీ డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికృష్ణ తో కలసి పరిశీలించారు. ప్రభుత్వం ఒక నెల రోజుల పాటు చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా అన్ని మున్సిపాలిటీ ల్లో చెత్తను శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుంటుందని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమం లో పాల్గొని మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. నగరంలోని కాలువల్లో చెత్త వేయడం వలన అవి అక్కడే ఆగిపోయి దోమలకు ఆవాసంగా మారుతుందని తెలిపారు. ఆ దోమల వలన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఇటువంటి కార్యక్తమాల వలన ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లలిత, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణ వార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చిరువోలులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ..




**మోపిదేవి,కలంకౌంటర్ :** మండల పరిధిలోని చిరువోలు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా బుధవారం నిర్వహించారు. చిరువోలు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నవ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి రాజకీయ తత్వవేత్త బహుభాషా కోవిదుడు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని అంబేద్కర్ మనవడు శ్రీ భీమ్ రావు యశ్వంత్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ విగ్రహావిష్కరణ నిర్వహణ కర్త కైలా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన బహిరంగ సభలో పలువురు వక్తలు పాల్గొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి ప్రసంగించారు. తొలు త అంబేద్కర్ విగ్రహం కింద అంబేద్కర్ లైబ్రరీ నీ ఆయన ప్రారం భించారు. ఈ కార్య క్రమంలో ఉప్పులేటి దేవి ప్రసాద్ , మేజర్ చంద్రకాంత్, కొనగళ్ళ జగన్నాథరావు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాజీ ఎమ్మెల్యే పాటూరి రామయ్య జడ్పిటిసి మల్లికార్జునరావు ఇన్చార్జి ఎంపీపీ జననీ కుమారి ఎలగపల్లి వెంకటేశ్వరరావు గొర్రెపాటి వెంకట రామకృష్ణ యార్లగడ్డ సోమశేఖర ప్రసాద్ దాసి సీతారామ రాజు ఎండిఓ స్వర్ణ భారతి సీఐ ఈశ్వరరావు ఎస్సై గౌతమ్ కుమార్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు గుర్రం వెంకటేశ్వరరావు దొబారి వెంకటేశ్వరరావు బెజవాడ రామారావు కర్ర అమరేంద్ర నాదెళ్ల ఆంజనేయులు మరియు అంబేద్కర్ అభిమానులు యువత పాల్గొన్నారు.

# ఎంఆర్ పల్లి స్మశాన వాటికను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే ఆరణి




**తిరుపతి,కలంకౌంటర్ :** ఎంఆర్ పల్లి పల్లి స్మశాన వాటికను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానికుల పిర్యాదు మేరకు కమిషనర్ శారదా దేవి, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి బుధవారం ఉదయం ఎమ్మెల్యే స్మశాన వాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్మశాన వాటిక విస్తరణకు అడ్డంకిగా ఉన్న ఇంటి పట్టా సమస్యకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి పరిస్కరించినట్లు చెప్పారు. అలాగే ఎస్పిడిసిఎల్ కు ఎంత స్థలం ఉందో సర్వే మిగిలిన స్థలంలో స్థానికుల కోరిక మేరకు స్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ అంగీకరించినట్లు ఆయన తెలిపారు. స్మశాన వాటిక లో కమ్యూనిటీ హాల్, కాంపౌండ్ వాల్ వెంటనే ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పిస్తామని ఆయన చెప్పారు. నగరపాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ ఎంఆర్ పల్లి స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గతంలోనే స్మశాన వాటిక అభివృద్ధికి అనుమతులు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. జిల్లా కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ సూచన మేరకు కర్మ క్రియలు సాఫీగా నిర్వహించుకునేందుకు అవసరమైన ప్రత్యేక హాలు, బోర్, నీటి టాంకర్ ని ఏర్పాటు చేస్తామన్నారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్మశాన వాటికలో మెరుగైన మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, డిఈ. మహేష్, సర్వేయర్ కోటేశ్వరరావు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గాలివాన బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ అండ




**జగ్గయ్యపేట,కలంకౌంటర్ :** ఇటీవల కురిసిన భారీ గాలివానకు ఇళ్ల పైకప్పులు లేచిపోయి, పూరిళ్లు దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడుతున్న పలు పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జగ్గయ్యపేట సబ్ బ్రాంచ్ ఆపన్నహస్తం అందించింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, జగ్గయ్యపేట సబ్ బ్రాంచ్ అధ్యక్షులు గొగుశెట్టి వెంకట మహేష్ , సభ్యులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి బాధిత కుటుంబాలకు అత్యవసర సహాయాన్ని అందజేశారు. గాలివాన ధాటికి నివాసాలు పూర్తిగా దెబ్బతిన్న లబ్ధిదారులకు రెడ్ క్రాస్ , ఇతర సంస్థల తరపున టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేయడంతో పాటు తక్షణ ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు. ఇల్లు తీవ్రంగా దెబ్బతిన్న ఉప్పె నాగరాజు కుటుంబానికి వట్టెం మనోహర్ రూ. 5,000, మానేపల్లి బ్రహ్మం రూ. 1,000 చొప్పున కలిపి మొత్తం రూ. 6,000 ఆర్థిక సహాయాన్ని, కె. వీరబాబు కుటుంబానికి లయన్స్ క్లబ్ సౌజన్యంతో రూ. 5,000 నగదు సహాయాన్ని,కాసర్ల వెంకమ్మ కుటుంబానికి కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ. 2,000 ఆర్థిక సహాయన్ని అందజేశారు. షేక్ ఇమాం సాహెబ్ కుటుంబానికి మానవతా దృక్పథంతో కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ తరఫున రానున్న మాసంలో కూడా మరో రూ. 2,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. అనంతరం కలిదిండు మల్లేశ్వరి, కొంకాల ఇందు, కాటుబొయెన మంత్తయ్య, షేక్ ఇమాం సాహెబ్, కాసర్ల వెంకమ్మ, కె వీరబాబు, ఉప్పె నాగరాజులకు పైకప్పుల రక్షణ నిమిత్తం తార్పాలిన్లను అందజేశారు. ఈ మానవతా కార్యక్రమంలో రెడ్ క్రాస్ అధ్యక్షులు గొగుశెట్టి వెంకట మహేష్, సభ్యులు మానేపల్లి బ్రహ్మం, గుండాల నారాయణ రెడ్డి, కె. కరుణాకర్, వట్టెం మనోహర్, స్థానిక వార్డు సభ్యులు గద్దం రాంబాబు మరియు పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టతకు కృషి చేయాలి.. ఎమ్మెల్యే కాగిత



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ ని మరింత పట్టిష్ట పరిచే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. బంటుమిల్లి లోని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం యూనిట్ స్థాయి సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల మధ్య సమన్వయం ఉండాలని, పార్టీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తోటి వారికి ప్రజలకు తెలియపరచడం క్షేత్రస్థాయిలో రాజకీయాలపై పూర్తిస్థాయి అవగాహనతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయడం, తరచూ ప్రజలతో మమేకమవుతు వారికి అవసరమైన సేవలు అందించే కార్యక్రమాలలో కార్యకర్తలు నిమగ్నం కావాలన్నారు. నిరంతరం పర్యవేక్షణ సమీక్షలతో పార్టీని సంస్థాగతంగా బలపేతం చేస్తూ ముందుకు సాగనున్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. బంటుమిల్లి మండలంలోని యూనిట్ ఇన్చార్జీలు, బూత్ ఇంచార్జీలు, కె ఎస్ ఎస్ లు సమావేశంలో పాల్గొని పార్టీ చేస్తున్న అభివృద్ధిని వివరించారు..

# శుభ్రత పాటిద్దాం.... వ్యాధులను తరిమేద్దాం..

-మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ నందు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, పి. వి. ఫణి కుమార్, డివిజన్ సచివాలయ సిబ్బంది, డివిజన్ స్వచ్ఛ సైనికులతో ముఖ్య అతిథిగా మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ పాల్గొని డ్రైనేజీ ల లోని పూడిక తీసి, రోడ్లు ఊడ్చి శుభ్రపరచి, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ మన ఇంట్లో చెత్త ఉంటే వెంటనే శుభ్రం చేస్తాం, కానీ అదే చెత్తను ఇంటి బయట రోడ్డు మీద వేస్తే అది మనకే సమస్యగా మారుతుంది అన్నారు. అందుకే నా ఇల్లు మాత్రమే కాదు, నా వార్డు, నా పక్కన పరిసరాలు శుభ్రంగా నా ఇల్లే అనే భావన ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే మనం పరిశుభ్రంగా ఉండగలం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా, డివిజన్ స్వచ్ఛ సైనికులు, హరి, ఆళ్ల దుర్గా మల్లేశ్వరరావు, ప్రసాద్ తదితరులతోపాటు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ, మాచవరపు మానస తదితర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 19వ ఆటా మహాసభలకు వైయస్ జగన్‌కు ఆహ్వానం



**తాడేపల్లి,కలంకౌంటర్ :** అమెరికాలో నిర్వహించనున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) మహాసభలకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ ను ఆటా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను కలిసిన ఆటా ప్రెసిడెంట్ జయంత్ చల్లా, మాజీ ప్రెసిడెంట్ భువనేష్ బుజల, ఆటా కాన్ఫరెన్స్ నేషనల్ కోఆర్డినేటర్ శరత్ వేముల, ట్రెజరర్ శ్రీకాంత్ గుడిపాటి, జయసింహారెడ్డి చల్లా, రామాంజుల రెడ్డి తదితరులు 2026 జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు అమెరికాలోని మేరిల్యాండ్ రాష్ట్రం, బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న 19వ ఆటా మహాసభల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆటా ప్రతినిధులతో వైయస్ జగన్ ఆత్మీయంగా మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ, అభివృద్ధికి ఆటా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఆటా సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ మహాసభలు ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు.

అమెరికాతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో తెలుగు ప్రజలు పాల్గొనే ఈ వేడుకలు తెలుగు వారి ఐక్యతను, సాంస్కృతిక వైభవాన్ని మరింతగా చాటిచెప్పాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆటా ప్రతినిధులు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, మహాసభల ఏర్పాట్ల గురించి వైయస్ జగన్‌కు వివరించారు.

# గంజాయి అమ్మినా, తాగినా ఆస్తులు సీజ్ -- సీఐ అన్వర్ భాష - కందుకూరులో గంజాయి ముఠాపై పోలీస్ డ్రోన్ నిఘా



**కందుకూరు,కలంకౌంటర్ :** గంజాయి అమ్మినా, తాగినా వారి ఆస్తులు సీజ్ చేస్తామని కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా హెచ్చరించారు. కందుకూరు పట్టణాన్ని గంజాయి రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రకాశం జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజు ఆదేశాల మేరకు, డీఎస్పీ సిహెచ్ వి బాలసుబ్రమణ్యం సూచనలతో కందుకూరు సిఐ అన్వర్ భాష, పట్టణ ఎస్ఐ పులి శివ నాగరాజ్ తో కలిసి బుధవారం డ్రోన్ సర్వైలెన్స్ (డ్రోన్ సర్వేలన్స్ ) ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కందుకూరు పట్టణ పరిధిలో ప్రత్యేక బృందాలతో ముమ్మర తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. పోతురాజు మిట్ట, బండపాలెం ప్రాంతాల్లో డ్రోన్లతో గాలింపు చేస్తున్నామని అన్నారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, తాగినా కఠిన చర్యలతో పాటు ఆస్తులను సీజ్ చేస్తామని తెలిపారు. గంజాయి సమాచారం ఇస్తే సమాచారం ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచడమే కాకుండా, నగదు బహుమతి ఇవ్వబడుతుందని తెలిపారు. కందుకూరును గంజాయి రహిత పట్టణంగా మార్చడానికి ప్రజలంతా పోలీసులకు సహకరించాలి సీఐ అన్వర్ భాష, ఎస్సై శివ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీకి , సోనియా గాంధీకి వెన్నుపోటు పొడిచింది జగన్ రెడ్డి - పువ్వాడి మౌనిక

- జగన్ మోహన్ రెడ్డి వెన్నుపోటుకు 15 సంవత్సరాలు.....



**కందుకూరు,కలంకౌంటర్ :** భారతదేశ చరిత్రలో వెన్నుపోటు రాజకీయాలకు తెరతీసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ప్రొఫెషనల్ వింగ్ కందుకూరు నియోజకవర్గం అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన కొలిశెట్టి శివకుమార్ ను బెదిరించి బలవంతంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని లాక్కొని శివకుమార్ కు వెన్నుపోటు పొడిచిన విషయాన్ని మౌనిక గుర్తుచేశారు. 2009 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంట్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేసి గెలుపొందిన జగన్ మోహన్ రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హెలిక్యాప్టర్ ప్రమాదంలో చనిపోతే శవాన్ని పక్కన పెట్టుకొని సంతకాల సేకరణ చేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వలేదనే కారణంతో సోనియా గాంధీ , కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచింది జగన్ మోహన్ రెడ్డి కాదా అని మౌనిక విమర్శించారు......

# బి ఎల్ ఏ లుకు అవగాహన కల్పించిన వైసీపీ ఇన్చార్జి బుర్రా



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు ఎస్వీఎస్ కళ్యాణమండపం నందు వైసీపీ ఆధ్వర్యంలో బి ఎల్ ఏ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఓటు మ్యాపింగ్ కార్యక్రమంలో బిఎల్ఏలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి ఓటు ఎంతో విలువైనదని ఆయన అన్నారు. సర్ విధానం ద్వారా ఓటర్ ప్రక్రియ నమోదు కార్యక్రమం జరుగుతుందని, వైసిపి వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు షేక్ రఫీ, వైఎస్ఆర్ సీపీ నాయకులు గంగిరెడ్డి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ ప్రారంభం

## విజయవాడ, విశాఖపట్నంలో బెంచ్ లు ఏర్పాటు

**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీ జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ (జీస్టాట్) అధికారికంగా ప్రారంభమయ్యింది. జీస్టాట్ కార్యాలయాన్ని తాత్కాలికంగా విజయవాడ లబ్బీపేట బృందావన్ కాలనీలోని వినమ్గర్ అపార్ట్మెంట్స్ (ఫ్లాట్ నంబరు 401) ఏర్పాటు చేశారు. అలాగే విజయవాడ, విశాఖపట్నం లలో రెండు బెంచ్లు ఏర్పాటయ్యాయి. ఏపీ జీస్టాట్ ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి వేమిరెడ్డి, సాంకేతిక సభ్యులు (సెంట్రల్) సతీష్కుమార్ అగర్వాల్ ను ఏపీ జీస్టాట్ బెంచ్లో సభ్యులుగా నియమించారు. విజయవాడ బెంచ్ పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలు ఉన్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలు విశాఖపట్నం బెంచ్ పరిధిలో ఉన్నాయి. ఆయా జిల్లాలకు చెందిన పన్ను చెల్లింపుదారులు, శాఖాధికారులు, అధికారిక ప్రతినిధులు, తదితరులు అప్పీళ్లు, అప్లికేషన్లు సంబంధిత బెంచ్ ల వద్ద దాఖలు చేయాల్సి ఉంటుంది.

# జిల్లాకో ప్రత్యేక థీమ్... టూరిజం ప్రాంతాల వేదికగా యోగా డే

- జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు-యోగా నెలగా జూన్
- పవన్ కళ్యాణ్ పై తెలంగాణ నేతల వ్యాఖ్యలు సరి కావు
- తమిళనాడుతో నాతో సహా వివిధ రాష్ట్రాల నేతలు ప్రచారం చేయలేదా..?
- ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు
- డీఎస్సీ నిర్వహణ అనేది టీడీపీ బ్రాండ్
- మంచి పనులపై బురద జల్లడమే కొందరు పనిగా పెట్టుకున్నారు
- మీడియా కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,కలంకౌంటర్ :** ప్రతిష్టాత్మకంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కోటి మందితో ఈ నెల 21వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా యోగా డే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. యోగాంధ్ర-2026 కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే కార్యక్రమాలను ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో వివరించారు. అలాగే ఇటీవల జరుగుతున్న పరిణామాల పైనా మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, అనారోగ్య సమస్యలకు యోగా బెస్ట్ మెడిసిన్. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసాన్ని అందించే సమగ్ర ఆరోగ్య సాధన యోగా. యోగాను మన జీవన విధానంలో భాగం చేసేందుకు యోగాంధ్ర ద్వారా ప్రయత్నిస్తున్నాం. ఈ ఏడాది కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'యోగాంధ్ర-2026' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యం. ఈ ఏడాది 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ 'శీస్త్రుఘ టశీతీ ఎముశ్రీష్ట్రఎ ాస్త్రఅఅస్త్ర'. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించేందుకు యోగాను అనుసరించాలని చెప్పడమే థీమ్ ఉద్దేశం. ఇది ఒక్కరోజు కార్యక్రమం కాదు. ప్రతి ఇంట్లో, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన ఉద్యమంగా మారాలి. ఈసారి యోగాంధ్ర 2026ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. గతేడాది స్ఫూర్తిని కొనసాగించాలి. జూన్ 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తాం. అమరావతిలో జరిగే ప్రధాన కార్యక్రమంలో కృష్ణానది వెస్ట్ బైపాస్ వంతెనపై 25 వేల మందితో యోగా ప్రదర్శన నిర్వహిస్తాం. ప్రతి జిల్లాకు ప్రత్యేక థీమ్ నిర్ణయించాం. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో కార్యక్రమాలు నిర్వహిస్తాం. ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మంది పాల్గొనే కార్యక్రమాలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించి యోగా-టూరిజాన్ని ప్రోత్సహిస్తాం. ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి చారిత్రక ప్రాంతాలు వేదికలుగా ఈ యోగా కార్యక్రమం చేపడుతున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**విద్యాభ్యాసంతో పాటు యోగాభ్యాసానికి ప్రాధాన్యత..** "యువతలో, మహిళల్లో, విద్యార్థుల్లో యోగా పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా యోగాను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను తయారు చేస్తాం. ప్రస్తుతం ఉన్న ట్రైనర్ల సంఖ్యను 2.50 లక్షలకు పెంచేందుకు కార్యాచరణ చేపట్టాం. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాం. జిల్లా స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రచారం, నిర్వహణ ఏర్పాట్లకు ఈ నిధులు వినియోగిస్తాం. అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశాం. యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా పరిమితం చేయకుండా 365 రోజుల ఉద్యమంగా కొనసాగిస్తాం. రాష్ట్రంలో ఒక కోటి మంది క్రమం తప్పకుండా యోగా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఏపీ యోగా ప్రచార పరిషత్, సంజీవని యాప్, హ్యాబిల్డ్ వాట్సాప్ కమ్యూనిటీల ద్వారా నిరంతర శిక్షణ చేపడుతున్నాం. జూన్ నెల మొత్తాన్ని 'యోగా నెల'గా ప్రకటించాం. దీనిని సక్సెస్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సాయం తీసుకుంటున్నాం. ప్రతి ఇంటికి యోగా చేరేలా మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు రూపొందించారు.

# హాస్టళ్లను, గురుకులాలను సిద్ధం చేయండి

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం



**అమరావతి,కలంకౌంటర్ :** వచ్చే నెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లను, గురుకులాల భవనాలను సిద్ధం చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదని స్పష్టంచేశారు. హాస్టళ్లు, తరగతి, విశ్రాంతి గదులను పరిశుభ్రం చేయాలని, పరిశుద్ధమైన నీరందించేలా చూడాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్లు, కిటికీలు, ద్వారాలకు దోమ తెరల ఏర్పాటు గురించి ఆరా తీశారు. బీసీ బిడ్డలు విద్యకు దూరంగా కాకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి హాస్టళు, గురుకుల పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య, ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు అందజేయడంతో పాటు సకాలంలో డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి కల్పనకు ప్రాధాన్యమివ్వడం వల్ల గతంలో ఎన్నడూ లేనంతగా టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. బీసీ హాస్టళ్లలోనూ అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదన్నారు. ఈ నెల అయిదో తేదీన గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆ కాన్ఫరెన్స్ లో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సవిత సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి రాందాస్ అద్వాలే అధ్యక్షతన జామ్ వేదికగా నేషనల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సమావేశం

- సమావేశంలో పాల్గొన్న మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**అమరావతి,కలంకౌంటర్ :** కేంద్ర మంత్రి రాందాస్ అద్వాలే అధ్యక్షతన జామ్ వేదికగా నేషనల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు జామ్ లో హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సమావేశంలో మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....పీఎం ఆదర్శ గ్రామ యోజనకి అదనంగా రూ. 50 లక్షలు పెంచాలని కోరారు. రాష్ట్రానికి నూతనంగా 58 సంక్షేమ హాస్టళ్లు మంజూరు చేయాలని, హాస్టళ్ల నిర్మాణం కోసం ఇచ్చే రూ. 3 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని మంత్రి డిఎస్ బీవీ స్వామి కోరారు. పీఎం అజయ్ కింద ఇచ్చే రుణాలను అధికశాతం మహిళలకు ఇవ్వాలని, రుణాలకు మహిళలకు 50 శాతం సబ్సిడీ వర్తింపచేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. ఎస్సీల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎస్సిల విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సమాజంలో ఎస్సీలు అనే విధాల అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం నాయక్, డైరెక్టర్ బి. లావణ్య వేణి తదితరులు పాల్గొన్నారు

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com